పంచాయతీరాజ్ వ్యవస్థ పనితీరు భేష్..

చిలుకూరు గ్రామాన్ని సందర్శించి కితాబిచ్చిన మహారాష్ట్ర అధికారుల బృందం

మొయినాబాద్, ఫిబ్రవరి 14 : తెలంగాణ రాష్ట్రంలో పంచాయతీరాజ్ వ్యవస్థ చాలా బాగుందని, ఇదే విధానం తమ రాష్ట్రంలో అమలు చేయాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని మహారాష్ట్ర అధికారుల బృందం సభ్యులు పేర్కొన్నారు. రాజేంద్రనగర్‌లోని తెలంగాణ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి సంస్థలో శిక్షణ పొందుతున్న మహారాష్ట్రకు చెందిన డిప్యూటీ సీఈవో, బీడీవోలు, ఎంపీవోలు, గ్రామ కార్యదర్శులు, ఎంపీపీలు బుధవారం మండల పరిధిలోని చిలుకూరు గ్రామపంచాయతీని సందర్శించి కితాబిచ్చారు. గ్రామ పంచాయతీ స్థాయిలో ఎంత మంది అధికారులు పని చేస్తారు, ఏయే స్థాయి అధికారులు ఉంటారు. అభివృద్ధికి ఎలాంటి నిధులు ప్రభుత్వం నుంచి వస్తాయి.. గ్రామపంచాయతీ విధి విధానాల గురించి క్లుప్తంగా తెలుసుకున్నారు.

చిలుకూరు గ్రామపంచాయతీని సందర్శించిన మహారాష్ట్ర అధికారుల బృందం

అనంతరం మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించి అన్ని శాఖల పనితీరు గురించి ఎంపీడీవో సంధ్యను అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో పరిధిలో ఎంత మంది అధికారులు, సిబ్బంది విధులు నిర్వహిస్తారు, ఏయే పనులు చేస్తారని అడిగారు. ఎంత మంది జడ్పీటీసీలు, ఎంపీటీసీలు ఉంటారని తెలుసుకున్నారు. మహారాష్ట్రలో అధికారులు, ప్రజాప్రతినిధుల విధులు, బాధ్యతలు, ప్రభుత్వ పరిపాలన విధి విధానాలను ఇక్కడి అధికారులకు వివరించారు. కానీ తెలంగాణలోని పంచాయతీరాజ్ వ్యవస్థ చాలా బాగుందని, అధికారులు, ప్రజాప్రతినిధుల పనితీరు., అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయం చాలా బాగుందని మహారాష్ట్ర అధికారుల బృందం కితాబిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ నక్షత్రం, కార్యదర్శి వెంకటేశ్, మహారాష్ట్ర అధికారులు రుద్రయ్య, మహేశ్వరి ఉన్నారు.

మోడల్ స్కూల్‌లో సీట్ల కోసం దరఖాస్తు చేసుకోవాలి

వికారాబాద్ జిల్లా విద్యాధికారి రేణుకాదేవి

వికారాబాద్, ఫిబ్రవరి 14 : జిల్లాలోని తెలంగాణ మోడల్ స్కూళ్లలో 2024-25 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో 100 సీట్లకు, 7వ తరగతి నుంచి 10వ తరగతి వరకు మిగిలిన ఖాళీలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వికారాబాద్ జిల్లా విద్యాధికారి రేణుకాదేవి బుధవారం తెలిపారు. దరఖాస్తులు సమర్పించుటకు చివరి తేదీ ఈ నెల 22 వరకు ఉందన్నారు. అడ్మిషన్ పొందుటకు పీహెచ్‌సీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ.125, ఓసీ విద్యార్థులు రూ.200 రుసుము ఆన్‌లైన్‌లో చెల్లించాల్సి ఉంటుందన్నారు. మిగతా సమాచారం కోసం http://telanganams.cgg.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని ఆమె సూచించారు.

సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరెడ్డి

ప్రభుత్వం ఇండ్ల పట్టాలు ఇచ్చేవరకు భూ పోరాటం ఆగదు

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి

చేవెళ్లటౌన్, ఫిబ్రవరి 14 : ప్రభుత్వం ఇండ్ల పట్టాలు ఇచ్చేవరకు భూ పోరాటం ఆగదని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి తెలిపారు. బుధవారం చేవెళ్లలో సీపీఐ అధ్వర్యంలో భూ పోరాట ప్రథమ వార్షికోత్సవ బహిరంగ సభ నిర్వహించారు. అంతకు ముందు సీపీఐ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేవెళ్లలో నాలుగు ఎకరాల్లో 700 మంది ఇండ్లు లేని నిరుపేదలు గుడిసెలు వేసుకొని ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ సంవత్సర కాలంగా మౌలిక సదుపాయాలు లేక ఎంతో ఇబ్బంది పడుతూ ఇండ్ల పట్టాలు సాధించాలని భూ పోరాటం చేస్తున్నారని తెలిపారు. వందల ఎకరాల ప్రభుత్వ భూములను కబ్జా చేసిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని, పేదవాడు మాత్రం తన గూడు కోసం 60 గజాల స్థలంలో గుడిసె వేసుకుంటే భూ కబ్జాదారులు అని అనడం విడ్డూరంగా ఉందన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చి 10 సంవత్సరాలు పూర్తయిన ఎన్నికల్లో ఇచ్చిన హామీలను గాలికి వదిలేశారని, మతాన్ని అడ్డుపెట్టుకొని రాజకీయ పబ్బం గడుపుతున్నారని ఆరోపించారు. గుడిసెలు వేసుకున్న గుడిసె వాసులందరికీ ప్రభుత్వం పట్టాలు ఇచ్చే వరకు సీపీఐ భూ పోరాటం ఆగదని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీంద్రచారి, రాష్ట్ర కమిటీ సభ్యుడు యాదిరెడ్డి, ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహ, సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

వివిధ కోర్సుల పరీక్షా ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 14 : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఈడీ నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలతో పాటు ఓయూ దూరవిద్యా కేంద్రమైన ప్రొఫెసర్ జి.రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ద్వారా అందించే డిగ్రీ కోర్సుల (బీఏ, బీబీఏ, బీకామ్) పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు.

పీజీ కోర్సుల పరీక్షా తేదీలు మార్పు

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని పీజీ కోర్సులు ఎంఏ, ఎంకామ్, ఎంకామ్ (ఐఎస్), ఎంఎస్‌డబ్ల్యూ, ఎంలిబ్ఐఎస్సీ, ఎంజేఅండ్‌ఎంసీ, ఎమ్మెస్సీ తదితర కోర్సుల మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈ నెల 20వ తేదీ నుంచి నిర్వహిస్తామని ప్రకటించినప్పటికీ దానిని వాయిదా వేసినట్లు చెప్పారు. ఈ పరీక్షలను తిరిగి వచ్చే నెల 13వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు.

వివిధ కోర్సుల పరీక్షా తేదీలు ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎమ్మెస్సీ (మాలిక్యులర్ అండ్ హ్యూమన్ జెనెటిక్స్) మూడో సెమిస్టర్ రెగ్యులర్, ఎమ్మెస్సీ (ఐఎస్) మొదటి, రెండు, మూడో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈ నెల 20వ తేదీ నుంచి, బీఈడీ (ఓడీఎల్) మూడో సెమిస్టర్ రెగ్యులర్, రెండో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను 21వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు.

ఆధ్యాత్మికత అలవర్చుకోవాలి

- కేంద్ర సమాచార శాఖ మంత్రి దేవూసింగ్ జెసింగ్‌భాయ్ చౌహాన్
- కన్హాలో ఘనంగా బాబూజీ మహరాజ్ 125వ జయంతి వేడుకలు

నందిగామ, ఫిబ్రవరి 14 : భారతదేశం ఆధ్యాత్మికతకు పునరుజ్జీవం పోస్తున్నదని, ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికత, సహజ్ మార్గం వైపు నడవాలని కేంద్ర సమాచార శాఖ మంత్రి దేవూసింగ్ జెసింగ్‌భాయ్ చౌహాన్ అన్నారు. రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం కన్హా శాంతి వనంలో శ్రీరామచంద్ర మిషన్, హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యాన గురువు కమలేశ్ పటేల్ అధ్వర్యంలో బుధవారం హార్ట్‌ఫుల్‌నెస్ రెండో గురువు బాబూజీ మహరాజ్ 125వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలను కేంద్ర మంత్రి ముఖ్య అతిథిగా హాజరై కమలేశ్ పటేల్‌తో కలిసి బాబూజీ మహరాజ్ పేరుతో తపాలా పోస్టల్ స్టాంపును విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి ధ్యానంతో కలిగే ప్రయోజనాలను వివరించారు. ధ్యానాన్ని ప్రతి ఒక్కరూ జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. దాజీకి పద్మభూషణ్ అవార్డుతో గౌరవించడం సంతోషంగా ఉందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా సహజ్ మార్గంపై చైతన్యం తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్న దాజీని ఆయన అభినందించారు. ప్రతి ఒక్కరూ సహజ్ మార్గం వైపు వెళ్లడం ద్వారా దేశం అపూర్వమైన పురోగతి సాధిస్తుందని మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో సుమారు 20వేల అభ్యాసకులు పాల్గొన్నారు.

బాబూజీ మహరాజ్ జయంతి వేడుకల్లో పాల్గొన్న అభ్యాసకులు

బాబూజీ మహరాజ్ పేరుతో తపాలా పోస్టల్‌ను విడుదల చేస్తున్న మంత్రి దేవూసింగ్ జెసింగ్‌భాయ్ చౌహాన్

రోడ్డు విస్తరణ విషయంలో ఇరువర్గాల మధ్య గొడవ

పలువురికి తీవ్ర గాయాలు

విలేకరులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్

శంకర్‌పల్లి, ఫిబ్రవరి 14 : రోడ్డు విస్తరణ పనుల విషయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగిన ఘటన శంకర్‌పల్లి మండలంలోని జనవాడ గ్రామంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. మిర్జాగూడ గేటు నుంచి జనవాడ గ్రామం ప్రధాన చౌరస్తా వరకు ప్రభుత్వ నిధులతో సీసీ రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించారు. జనవాడ గ్రామంలోని ప్రధాన చౌరస్తాలోని క్రైస్తవ ప్రార్థన మందిరానికి ఆనుకుని రోడ్డు వేయవద్దని కొంత మంది యువకులు గ్రామ పెద్దలతో గొడవకు దిగారు. అది కాస్త మాటామాట పెరిగి రాళ్లు, కర్రలతో దాడి చేసుకోవడంతో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా ఇన్‌చార్జి డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్ పోలీసు బలగాలతో అక్కడికి చేరుకుని క్షతగాత్రులను దవాఖానకు తరలించి పరిస్థితిని అదుపు చేశారు. బుధవారం ఇరువర్గాలకు చెందిన మత పెద్దలు వచ్చి దాడులకు పాల్పడినవారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర మైనార్టీ కమిషనర్ శంకర్‌లుక్స్ ఘటనా స్థలానికి చేరుకుని నిందితులను కఠినంగా శిక్షించాలని పోలీసులకు సూచించారు. రాష్ట్ర బీఎస్పీ అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ జనవాడ గ్రామంలోని చర్చి లోపలికి వెళ్లి దాడి చేసిన వారిని శిక్షించాలని.. రోడ్డుపై బైఠాయించి నిరసన చేపట్టి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాజేంద్రనగర్ ఇన్‌చార్జి డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్ విలేకరులతో మాట్లాడుతూ.. గొడవకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఏసీపీ లక్ష్మీనారాయణ, సీఐలు వీరబాబు, వినాయకరెడ్డి పాల్గొన్నారు.

చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కారుపై దాడి

జనవాడ గ్రామంలో జరిగిన ఘటనకు చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కారుపై బీఎస్పీ నాయకులు దాడి చేశారు. బుధవారం మణి గార్డెన్ ఫంక్షన్ హాలులో పెళ్లి ముగించుకొని మిర్జాగూడ గ్రామంలో పెళ్లికి హాజరై జనవాడ గేటు వద్దకు రాగానే బీఎస్పీ నాయకులు కారుపై దాడి చేశారు. ఈ ఘటనను ఖండిస్తూ చేవెళ్ల అసెంబ్లీ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు బీర్ల సురేశ్ విలేకరులతో మాట్లాడుతూ.. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అక్కడే ఉండి కూడా కార్యకర్తలను ఆపకపోవడం విడ్డూరమని పేర్కొన్నారు. ఘటనా స్థలంలో పోలీసులు లేకపోతే ఎటువంటి పరిణామాలు జరిగేవో అని ఆవేదన వ్యక్తం చేశారు. జనవాడ ఘటనకు బీజేపీకి ఎటువంటి సంబంధం లేదని తెలిపారు. మాజీ ఎంపీపై దాడి చేసినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల మాజీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, సీనియర్ నాయకులున్నారు.

నిరసన తెలుపుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

ఫిల్మ్ ఫెస్టివల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఓయూ అధికారులు, విద్యార్థి నిర్వాహకులు

మార్చి 27, 28న జాతీయ స్థాయి షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 14: ఉస్మానియా యూనివర్సిటీ జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ విభాగం ఆధ్వర్యంలో మార్చి 27, 28న జాతీయ స్థాయి షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్‌ను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఓయూ పరిపాలనా భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో 'జష్న్-ఏ-సైన్మా'గా వ్యవహరించే ఈ ఫెస్టివల్‌కు సంబంధించిన పోస్టర్‌ను వీసీ ప్రొఫెసర్ రవీందర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ చింత గణేశ్, జర్నలిజం విభాగం హెడ్ డాక్టర్ టి.సతీశ్ బుధవారం ఆవిష్కరించారు. ఇతర వివరాలకు jashnesainma@gmail.com మెయిల్‌లో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ విష్ణుదేవ్, ప్రొఫెసర్ కృష్ణకుమార్, ప్రొఫెసర్ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

పంటల నమోదు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలి

మల్కాపూర్ గ్రామంలో సాగు చేసిన పుదీన పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి గీతారెడ్డి, పక్కన ఎంఏవో తులసి

- రంగారెడ్డి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గీతారెడ్డి
- మల్కాపూర్‌లో పంటల నమోదు ప్రక్రియ పరిశీలన

చేవెళ్ల రూరల్, ఫిబ్రవరి 14 : పంటల నమోదు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గీతారెడ్డి అన్నారు. బుధవారం చేవెళ్ల మండలం మల్కాపూర్ గ్రామంలో వ్యవసాయ విస్తరణాధికారులు చేస్తున్న యాసంగి సీజన్ పంటల నమోదు ప్రక్రియను మండల వ్యవసాయ అధికారి తులసితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా గీతారెడ్డి మాట్లాడుతూ.. పంటలు పండించే ప్రతి రైతూ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వేసిన పంటలకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలన్నారు. లేకపోతే ధాన్యం కొనుగోలు, తదితర ప్రభుత్వ సౌకర్యాలు కోల్పోతారని పేర్కొన్నారు. విధిగా ఆన్‌లైన్ పంటల వివరాలను పొందుపర్చుకునేలా కృషి చేయాలని ఆమె రైతులకు సూచించారు. డీఏవో వెంట మండల వ్యవసాయ విస్తరణాధికారి వరుణ్, రైతులు కాంతిరెడ్డి, మల్లారెడ్డి ఉన్నారు.

రీ వ్యాలిడేషన్ చేసి లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

మండల తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి షాదీముబారక్ రీ వ్యాలిడేషన్ చేసిన చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్న మండల డిప్యూటీ తహసీల్దార్ మహేశ్‌కుమార్

- మండలంలో 17 మంది లబ్ధిదారులకు నూతన చెక్కుల పంపిణీ
- 'చెల్లని చెక్కు! గడువు ముగిసిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ' అనే శీర్షికతో 'నమస్తే తెలంగాణ'లో కథనం ప్రచురితం
- కథనం ప్రచురించిన 4 రోజుల్లో లబ్ధిదారులకు న్యాయం.. నూతన చెక్కుల పంపిణీ
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

పెద్దేముల్, ఫిబ్రవరి 14 : 'చెల్లని చెక్కు!' 'గడువు ముగిసిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ' అనే శీర్షికతో 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి మండల రెవెన్యూ అధికారులు స్పందించారు. బుధవారం నూతన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. వివరాల్లోకి వెళితే.. మండల కేంద్రంలోని రైతు వేదికలో ఈ నెల 6వ తేదీన మండల రెవెన్యూ అధికారులు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా, ముఖ్య అతిథిగా తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డితో పాటు పలువురు మండల ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులు హాజరై మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన కొంతమంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేసి వెళ్లిపోయారు. మిగిలినవాటిని గ్రామాల వారీగా రెవెన్యూ అధికారులు పంపిణీ చేశారు. మండలానికి మొత్తం 122 కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు మంజూరు కాగా, అందులో 17 చెక్కులు కాలపరిమితి దాటిపోయి ఉండగా వాటిని అధికారులు చూసుకోకుండా హడావుడిగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. దీంతో అధికారులు చేసిన తప్పిదంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చెక్కులను లబ్ధిదారులు బ్యాంకుల్లోని తమ ఖాతాల్లో జమ చేయడానికి తీసుకెళ్లగా చెక్కుల కాలపరిమితి దాటిపోయిందని బ్యాంకు అధికారులు చెప్పడంతో ఒక్కసారిగా అవాక్కయ్యారు. అయితే విషయం 'నమస్తే తెలంగాణ దినపత్రిక' దృష్టికి రావడంతో ఈ నెల 10న 'చెల్లని చెక్కు!' 'గడువు ముగిసిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ' అనే శీర్షిక ప్రచురితమైంది. మండల రెవెన్యూ అధికారులు తర్జన భర్జన పడుతూ తక్షణమే ఆగమేఘాల మీద లబ్ధిదారులను కార్యాలయానికి పిలిపించుకొని వారి వద్ద ఉన్న గడువు ముగిసిన చెక్కులను వెనక్కి తీసుకొని ఒక ఫైల్ మాదిరిగా తయారు చేసి పాత చెక్కులపై తేదీలను మార్చడానికి (రీ వ్యాలిడేషన్) కోసం తాండూరులోని ఆర్డీవో కార్యాలయానికి పంపగా అక్కడ నుంచి అధికారులు చెక్కులను బ్యాంకుకు పంపి చెక్కులపై పాత తేదీలను మార్చి కొత్త తేదీలతో రీ వ్యాలిడేషన్ చేసి పెద్దేముల్ మండల తహసీల్దార్ కార్యాలయానికి పంపడం జరిగింది. మండలానికి వచ్చిన నూతన కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌కు సంబంధించిన 17 చెక్కులను బుధవారం మండల డిప్యూటీ తహసీల్దార్ కె.మహేశ్‌కుమార్ లబ్ధిదారులను కార్యాలయానికి పిలిపించి తన ఛాంబర్‌లో పంపిణీ చేశారు. నమస్తే తెలంగాణ దినపత్రికలో వచ్చిన కథనానికి మండల రెవెన్యూ అధికారులు వెంటన స్పందించి నాలుగు రోజుల్లో నూతన చెక్కులను తమకు అందించడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. రెవెన్యూ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

షాబాద్‌లో ఫెర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గీతారెడ్డి

రైతులకు సరిపడా ఎరువులు

రంగారెడ్డి జిల్లా వ్యవసాయశాఖ అధికారి గీతారెడ్డి

షాబాద్, ఫిబ్రవరి 14 : జిల్లాలో రైతులకు సరిపడా ఎరువుల నిల్వలు ఉన్నాయని రంగారెడ్డి జిల్లా వ్యవసాయశాఖ అధికారి గీతారెడ్డి తెలిపారు. బుధవారం షాబాద్ మండలంలోని నాగరగూడ, షాబాద్‌లోని పలు ఫెర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. అనంతరం ఆయా షాపుల్లోని ఎరువులు, స్టాక్ రిజిస్టర్లు, ఈ పాస్ యంత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో రైతులకు సరిపడా ఎరువుల నిల్వలు(యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు)ఉన్నాయని చెప్పారు. డీలర్లు కృత్రిమ కొరత సృష్టించవద్దని, ఈ-పాస్ యంత్రాల ద్వారానే ఎరువులను విక్రయించాలని సూచించారు. ఫెర్టిలైజర్ డీలర్లందరూ రైతులకు సరిపడా ఎరువుల నిల్వలను మెయింటెన్ చేయాలని, ఎలాంటి కొరత రాకుండా చూడాలని కోరారు. డీలర్లు ప్రభుత్వ ఆదేశాలను కచ్చితంగా పాటించాలని, అదేశాలను పాటించని డీలర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో చేవెళ్ల డివిజన్ వ్యవసాయాధికారి రమాదేవి, షాబాద్ మండల వ్యవసాయాధికారి వెంకటేశం ఉన్నారు.

మహిళా ఆంత్రప్రెన్యూర్లకు లోన్ ఫెసిలిటీ

సిటీబ్యూరో, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ) : మహిళా ఆంత్రప్రెన్యూర్లకు లోన్ ఫెసిలిటీ, బ్యాంకర్లను అనుసంధానం చేసేలా వీ హబ్ ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ నెల 19న లోన్ సౌకర్యాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించనుండగా మహిళా ఆంత్రప్రెన్యూర్లు సద్వినియోగం చేసుకోవాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళలకు అవసరమైన ఆర్థిక ప్రోత్సాహం, లోన్ సదుపాయాలను పొందడానికి బ్యాంకర్లు, ఫైనాన్సియర్ సంస్థలు పాల్గొంటాయని తెలిపారు. జూబ్లీహిల్స్ రోడ్ నం.45లోని వీ హబ్ ప్రధాన కార్యాలయానికి ఈ నెల 19న ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పూర్తి ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని పేర్కొన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన

సిటీబ్యూరో : అగ్ని ప్రమాదాలపై చిన్నారులకు అవగాహన కల్పిస్తే వారి జీవితకాలం భద్రత నైపుణ్యాలు అలవర్చుకుంటారని ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాశ్ రెడ్డి తెలిపారు. ఈవీడీఎం ఆధ్వర్యంలో 21 ప్రాంతాలలో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఆరు పబ్లిక్ ప్రాంతాలు, ఏడు షాపింగ్ మాల్స్/షోరూంలు, ఏడు పాఠశాలలు/కాలేజీలు, ఒక దవాఖానలో వారం రోజులుగా మాక్ డ్రిల్ నిర్వహించి అవగాహన కల్పించారు. సెయింట్ జోసెఫ్ జూనియర్, డిగ్రీ కాలేజి (టౌలిచౌకి), సికింద్రాబాద్ నవ కేతన్ కాంప్లెక్స్, న్యూ మలక్‌పేట ది ఏబీఎం స్కూల్, కొత్తపేట సౌత్ ఇండియా షాపింగ్ మాల్, సుచ్రిత క్రాస్‌రోడ్ జయభారతి మెడోస్ షాపింగ్ కాంప్లెక్స్‌లో మాక్ డ్రిల్ చేపట్టారు. వాణిజ్య భవనాలు, ఆసుపత్రులు, పాఠశాలలో మాక్ డ్రిల్ అవసరం అనుకుంటే 040-2955 5500, 9000113667లను సంప్రదించాలని ఆయన కోరారు.

రోడ్డు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు తగ్గుతాయి

వికారాబాద్ ఎస్పీ కోటిరెడ్డి

వికారాబాద్, ఫిబ్రవరి 14 : రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా జిల్లాలోని పోలీస్‌స్టేషన్ల పరిధుల్లో వాహనదారులకు రోడ్డు రవాణాపై అవగాహన కల్పించామని వికారాబాద్ ఎస్పీ కోటిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోడ్డు భద్రతా వారోత్సవాలను ముగిస్తున్నామన్నారు. రోడ్డు నియమాలను ప్రతిఒక్కరూ పాటించినప్పుడే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని, ఒకరి నిర్లక్ష్యం మరొకరికి శాపంగా మారుతుందన్నారు. రోడ్డు ప్రయాణం లేకుండా మనిషికి మనుగడ లేదు. మనిషి ఉదయం లేచిన దగ్గరి నుంచి రాత్రి పడుకునే వరకు ప్రతి ఒక్కరికీ రోడ్డు లేనిదే జీవితం లేదన్నారు. జీవితంలో ఇంత ప్రాముఖ్యత ఉన్నటువంటి రోడ్లను మనం సక్రమంగా, రోడ్డు భద్రతను పాటించకుంటే అవే యమపాశాలుగా మరే అవకాశం ఉంటుందని తెలిపారు. కుటుంబ సభ్యులు ప్రత్యేక దృష్టి పెట్టి పిల్లలు, ఉద్యోగులు, డ్రైవర్లు తదితరులు వారు బయటకు వెళ్లే సమయంలో రోడ్డు భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించేలా చూడాలని సూచించారు. మైనర్ పిల్లలకు తల్లిదండ్రులు ఎట్టి పరిస్థితిల్లోనూ వాహనాలు ఇవ్వకూడదని, మైనర్ పిల్లలు వాహనాలతో పట్టుబడితే తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. లైసెన్స్ లేనివారికి వాహనాలు ఇస్తే యజమానులపై కూడా చట్టప్రకారం చర్య తీసుకుంటామన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, 4 వీలర్స్ ఆపై వారు తప్పనిసరిగా సీట్ బెల్ట్ పెట్టుకునే వాహనాలు నడపాలని పేర్కొన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ చేయకూడదని, అలా చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనాలు నడిపే వారి దగ్గర అన్ని రకాల పత్రాలు కలిగి ఉండాలని, తల్లిదండ్రులు పిల్లలకు వాహనాలు ఇప్పించే ముందు వారికి డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా విద్యా ప్రాముఖ్యత తెలుసుకొని అవగాహన కల్పించుకొని రోడ్డు ప్రమాదాల నివారణలో భాగం కావాలని ఎస్పీ సూచించారు.